ప్రజాశక్తి

సోమవారం 28 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వ స్థలాలు

- ఆధునిక వైద్యం ముసుగులో హెల్త్ సిటీ అభివృద్ధి
- ఇఎస్ఐ, జిల్లా కేంద్ర ఎన్‌టిఆర్ హాస్పిటల్ సేవలు నిర్వీర్యం
- భూముల వ్యవహారంపై అధికారుల గోప్యత



భూములను పరిశీలిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్ (ఫైల్)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ప్రజల ఆస్తులను కావాల్సిన వారికి కట్టబెట్టడానికి ప్రభుత్వం ఆడని నాటకంలేదు. చేయని పనిలేదు. ఎద్దు ఈనిందంటే దూడను కట్టేయాలని తాడు పట్టుకొని పరుగులు తీసే అధికారులున్న జిల్లాలో అభివృద్ధి ముసుగులో ప్రయివేటు వ్యక్తులకు విలువైన ఆస్తులను ధారాదత్తంచేసే చర్యను వేగవంతం చేస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించని ప్రభుత్వం నక్కపల్లిలో ప్రయివేటు మిట్టల్ స్టీల్‌కు గనులు, ఇతర అనుమతులకు పూచీ పడింది. తాజాగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల పేరుతో అనకాపల్లిలో తొలుత 7.68 ఎకరాల విస్తీర్ణంలో హెల్త్ సిటీని అభివృద్ధిచేసి ప్రభుత్వ, ప్రయివేటు, భాగస్వామ్యం (పిపిపి) కింద ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు కారుచౌకగా స్థలాలను అప్పగించాలని చూస్తోంది. జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల మెరుగు కంటే ప్రయివేటు ఆసుపత్రులను ప్రోత్సహించే ఆలోచనలో ప్రభుత్వం వుంది. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి పరిశ్రమల కార్మి కులకు అందుబాటులో ఉండేలా అచ్యుతాపురం సెజ్‌లో రూ.62 కోట్ల వ్యయంతో 30 పడకల ఎంప్లాయ్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) ఆసుపత్రి, వైద్యులు, సిబ్బంది నిమిత్తం 16 నివాస గృహ సముదాయాల భవన నిర్మాణ పనులకు 2024 అక్టోబర్ 29న ప్రధాన మోడీ వర్చువల్‌లో శంకుస్థాపన చేశారు. సెజ్, ఇతర పరిశ్రమల కార్మిక కుటుంబాలకు, పరిశ్రమల ప్రమాద సమయంలో బాధితులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పి ఏడాది కాకముందే పరిశ్రమల ప్రమాదాల్లో గాయపడిన కార్మికుల కోసం హెల్త్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు కొత్త పల్లవి అందుకున్నారు. ఇఎస్ఐ, ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందించే బాధ్యత నుంచి తప్పుకొనేలా ప్రభుత్వ చర్యలున్నాయి. ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపనచేసి ఏడాది కాకముందే ప్రయివేటు ఆసుపత్రులను ప్రోత్సహిస్తోంది. విశాఖ నగరంలోని ఆరిలోవ హెల్త్ సిటీలో ప్రభుత్వం నుంచి భూములు పొందిన ప్రయివేటు ఆసుపత్రులేవీ పేదలకు ఉచిత వైద్య సేవల కల్పనపై ఇచ్చిన హామీని అమలుచేయడంలేదు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల ముసుగులో అచ్యుతాపురం ఇఎస్ఐ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్‌టిఆర్ ఆసుపత్రిని ప్రభుత్వం తాజాగా నిర్వీరం చేయాలని చూస్తోంది.

ప్రయివేటు ఆసుపత్రులకు చౌకగా భూములివ్వడంతో సరిపెట్టుకోకుండా అన్ని మౌలిక సదుపాయాలనూ సమకూర్చి అప్పగించే ఆలోచనలో సర్కారు వుంది. హెల్త్‌సిటీలో మౌలిక సదుపాయాలను విఎంఆర్‌డిఎ కల్పించాక ప్రయివేటు ఆసుపత్రులకు స్థలాలు కేటాయించనున్నారు. అయితే హెల్త్‌సిటీకి మిగతా 2లో..

మేయర్ అభ్యర్థిగా పీలా

- ఖరారు చేసిన అధిష్టానం
- బి ఫారం అందజేసిన టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి



పీలాకు బి ఫారం అందజేస్తున్న బాబ్జి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం జివిఎంసి మేయర్ ఎన్నిక నేపథ్యంలో టిడిపి అధిష్టానం కీలక ప్రకటన చేసింది. ఊహించినట్టుగానే మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పార్టీ జిల్లా కార్యాలయంలో పీలాకు ఆదివారం బి ఫారం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ మేయర్ మార్పు విశాఖ కోసమే జరుగుతోందని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైతే నాలుగేళ్లపాటు వైసిపి పాలనతో జివిఎంసిలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. కూటమి పాలనలో విశాఖను అభివృద్ధి చేయాలనే దృక్పథంతో పై నాయకులు మేయర్‌ను మార్చాలని నిర్ణయించారని చెప్పారు. మేయర్ మార్పుతో విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, టిడిపి, జనసేన, బిజెపి కూటమి మేయర్ అభ్యర్థిగా ఎంపికైన పీలా శ్రీనివాసరావు 2021 మార్చిలో జరిగిన జివిఎంసి ఎన్నికల్లో 96వ వార్డు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. అప్పట్లో టిడిపి పీలా శ్రీనివాసరావును మేయర్ అభ్యర్థిగా ముందుగానే ప్రకటించింది. అయితే ఆ ఎన్నికలలో అధిక శాతం కార్పొరేటర్లు వైసిపి తరపున ఎన్నిక కావడంతో మేయర్ పీఠం టిడిపికి దక్కలేదు. దీంతో కౌన్సిల్‌లో టిడిపి ఫ్లోర్ లీడర్‌గా మిగతా 2లో..

వక్ఫ్ సవరణ వెనుక బోలెడు కుట్రలు

వార్త 2లో..

టెన్త్‌లో ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు

వార్త 2లో..

అక్రమ లేఅవుట్లతో తస్మాత్ జాగ్రత్త

వార్త 5లో..



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు

కార్మిక సదస్సులో వక్తలు వార్త మెయిన్‌లో..

లోన్ యాప్స్ మోసాల ముఠా అరెస్టు

కీలక కేసును ఛేదించిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు



లోన్ యాప్స్ ముఠా వివరాలను వెల్లడిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాకిస్తాన్ కేంద్రంగా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న లోన్ యాప్స్ ముఠాను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. మహారాణి పేటకు చెందిన నరేంద్ర లోన్ యాప్స్ నుంచి రూ.2 వేలు లోన్ తీసుకుని కొంత డబ్బులు తిరిగి చెల్లించాడు. అయినా సరే ఇంకా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాలని అవతలివారు వేధించడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. గూగుల్ నుంచి వచ్చిన సమాచారం, బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా చనిపోయిన వ్యక్తి లోన్ తీసుకున్న డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో విచారణలో తేల్చారు. పాకిస్థాన్ కేంద్రంగా ఈ ముఠా నడుస్తున్నట్టు గుర్తించారు. సుమారు భారత్ నుంచి 9 వేల మంది బాధితులు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు విశాఖ సిపి తెలిపారు. తదుపరి విచారణలో ఈ కేసులో ప్రధాన నిందితునితో పాటు మరో 9 మందిని అరెస్టు చేశారు. 18 మొబైల్ ఫోన్లను, ఒక ల్యాప్ టాప్‌ను, 54 సిమ్ కార్డులు, 60 లక్షల రూపాయల నగదును ఫ్రీజ్ చేశారు. ఈ ముఠా సభ్యులు ఆన్‌లైన్‌లో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వ స్థలాలు

గుర్తించిన 7.68 ఎకరాల విషయాన్ని చెప్పడానికి అధికారులు ఇష్టపడ్డంలేదు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి వుంటే అచ్యుతాపురం ఇఎస్ఐ, జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

మేయర్ అభ్యర్థిగా పీలా

పీలా శ్రీనివాసరావు ఎంపికైతే నాలుగేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. నాడు జివిఎంసిలో వైసిపి తరపున ఎన్నికైన మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో పదవి నుంచి దించేయాలని భావించారు. ఈ క్రమంలోనే కూటమి తరపున అవిశ్వాస తీర్మానం పెట్టి ఇటీవల తొలగించారు. సోమవారం మేయర్ స్థానానికి ఎన్నిక జరగనుంది. పీలా శ్రీనివాసరావు 2007లో విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికలలో 64వ వార్డు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. శ్రీనివాసరావు కుటుంబం ప్రారంభం నుంచి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతోంది. ఆయన తండ్రి పీలా మహాలక్ష్మి నాయుడు తెలుగుదేశం పార్టీ తరపున పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షునిగా రెండు పర్యాయాలు పనిచేశారు. అలాగే శ్రీనివాసరావు అన్నయ్య పీలా గోవింద సత్యనారాయణ అనకాపల్లి శాసనసభ్యునిగా 2019 ఎన్నికల్లో గెలుపొందారు. 2024లో కూటమి పార్టీల సర్దుబాట్లు కారణంగా ఆయనకు మరోసారి పోటీ చేసే అవకాశం రాలేదు. ఇటీవల ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవిని తెలుగుదేశం పార్టీ ఇచ్చింది.

లోన్ యాప్స్ మోసాల ముఠా అరెస్టు

ఎలాంటి హామీ లేకుండా తక్కువ మొత్తంలో సులువుగా లోన్లు ఇస్తూ అధిక వసూళ్లకు పాల్పడుతోందని గుర్తించారు.

మోసం జరిగే తీరిదీ..

ఈ ముఠా సభ్యులు సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తుంటారు. వాటిపై క్లిక్ చేసిన వెంటనే ఆ ఫోన్‌లోని కాంటాక్ట్స్ సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లేవి. అనంతరం వారి వ్యక్తిగత సమాచారం అంతా తీసుకుని కొంత మొత్తం అప్పుగా ఇచ్చేవారు. తీసుకున్న అప్పు చెల్లించినప్పటికీ ఇంకా తమకు అందలేదని చెప్పేవారు. ఎదుటవారిని బ్లాక్ మెయిల్ చేయడంతో పాటు ఫోన్‌లోని రుణగ్రస్తుని కాంటాక్ట్స్‌లోని బంధువులకు, మిత్రులకు అసభ్యకర సందేశాలు, ఫోటోలు పంపేవారు. వారినీ డబ్బులు చెల్లించాలని వేధించేవారు. ఇప్పటి వరకూ ఈ ముఠా సభ్యులు సుమారు రూ.200 కోట్ల లావాదేవీలు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. అమాయకులే వీరి టార్గెట్‌గా ఉండేవారని విశాఖ సిపి తెలిపారు. ఖాతాదారులకు తెలియకుండా వారి ఖాతా వివరాలు సేకరించడం, వారికి తెలియకుండానే లావాదేవీలు నడిపించడం ఇప్పుడు సైబర్ నేరగాళ్ల కొత్త ట్రెండ్ అని అన్నారు. అమాయకులకు కమీషన్ల ఆశచూపి వారి ధ్రువపత్రాలను ఉపయోగించి బ్యాంకు ఖాతాలు తెరిపించి మరీ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బులను దాచుకునేందుకు మ్యూల్ ఖాతాలు అమాయకుల చేత తెరిపిస్తున్నారని, మధ్యవర్తులను నియమించుకొని కమీషన్లు ఇస్తూ ఖాతాదారులకు తెలియకుండా లావాదేవీలు కొనసాగిస్తున్నారని వెల్లడించారు.


వక్ఫ్ సవరణ వెనుక బోలెడు కుట్రలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముస్లిములపై దాడులు చేస్తూ ముస్లిముల ఆస్తులు కొల్లగొట్టేయాలన్న కుట్రతోనే కేంద్ర బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం-2025 బిల్లును ప్రవేశపెట్టిందని, దీన్ని వ్యతిరేకిస్తున్నామని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ప్రతినిధి రహమతుల్లా బేగ్ అన్నారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లిం దాతలు ఎప్పుడో తమ అభీష్టం ప్రకారం ముస్లిం సమాజం కోసం త్యాగం చేసి దానం చేసిన ఆస్తులని, ఇవి ప్రభుత్వానికి సంబంధించినవి కావని అన్నారు. న్యాయవాది షరీఫ్ మాట్లాడుతూ నాటి వక్ఫ్ బోర్డు నేపథ్యాన్ని వివరించారు. రాష్ట్రంలో సుమారు 3500 వక్ఫ్ సంస్థలు మసీదు, బరియల్ గ్రౌండ్స్, పంజాలు, అషూర్ ఖానాలు, లంగర్ ఖానాలు, ఇధాలు పేరిట వక్ఫ్ ఆస్తులను కలిగి ఉన్నాయని, సుమారు 65 వేల ఎకరాలుగా అవి నమోదయ్యాయని తెలిపారు. ఆ భూములను సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ వక్ఫ్ బోర్డు నిర్ధారించినట్టు పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డులోని ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాకుండా బోర్డు ఆదాయం నుంచే చెల్లిస్తున్నారని తెలియజేశారు. సమావేశంలో ముస్లిం నేతలు అహమతుల్లా ఖాన్, బషీర్, షరీఫ్, మునీర్ ఖాన్, నూర్ అహ్మద్, షేక్ బాజ్జి పాల్గొన్నారు.

షటిల్ టోర్నీ విజేతలు హర్ష, సూర్య

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని ఎండాడ ఎస్ఎస్ అకాడమీలో ఆదివారం ఉదయం నిర్వహించిన వెలగాడ అప్పలనాయుడు మెమోరియల్ షటిల్ టోర్నమెంట్-2025లో విన్నర్స్‌గా సాయి హర్ష, పందిరి సూర్య ప్రకాష్ నిలిచారు. నాకౌట్ పద్ధతిలో ఈ షటిల్ టోర్నమెంట్ జరగ్గా సుమారు 30 మంది పాల్గొన్నారు. రెండో స్థానంలో నితేష్, తేజ, మూడో స్థానంలో శ్రీనివాస్‌రెడ్డి, మోహన్ నిలిచారు. ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ యాజమాన్య ప్రతినిధులు సమీర్, నవీన్ స్వరూప్, సందీప్ పర్యవేక్షణలో ఈ టోర్నీ జరిగింది. ఓనర్ సమీర్ తండ్రి వెలగాడ అప్పలనాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు ఎస్ఎస్ అకాడమీ నిర్వాహకులు సంధ్య తెలిపారు.



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ఉర్సా.. భూ అక్రమాల మరక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉర్సా (యుఆర్ఎస్ఎ) క్లస్టర్స్ కంపెనీకి విశాఖలో రెండు చోట్ల సుమారు రూ.3 వేల కోట్ల విలువైన 60 ఎకరాల భూమిని కేటాయించిన వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్టు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వ్యవహారంలో 'కూటమి' మూడు పార్టీల్లోనూ చర్చ సాగుతూ ప్రభుత్వానికి మాయని మచ్చగా ఉండన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. విశాఖ జిల్లాలోని కాపులుప్పాడలో యాభై ఆరున్నర ఎకరాలు, రుషికొండ ఐటి హిల్స్ నెంబర్ 3లో మూడున్నర ఎకరాలను ఉర్సా క్లస్టర్స్ గ్లోబల్ టెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందిగాక... కొత్త కథను తాజాగా ప్రచారంలో పెట్టింది. రుషికొండ ఐటి హిల్ నెంబర్ 3పై టిసిఎస్‌కు చేసిన 21.16 ఎకరాల భూ కేటాయింపులతో ఉర్సా వ్యవహారం బయటకొచ్చింది. గతంలో అదానీకి కాపులుప్పాడలో భూములు ఇచ్చినప్పుడే ఉర్సాకు ఇచ్చామని మాట మార్చే యత్నాలకు సర్కారు దిగడం గమనార్హం. వాస్తవానికి టిసిఎస్ సంస్థ భూమిని కోరకుండానే విశాఖ ఐటి హిల్స్‌పై రూ.99 పైసలకు ఎకరాను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రంలో చర్చ నడుస్తుండగానే తాజాగా ఉర్సాకు భూ కేటాయింపులు జరిగినట్టుగా పలు జాతీయ స్థాయి మీడియా సంస్థల ద్వారా వార్తలు హల్ చల్ చేశాయి.

చంద్రబాబు హుటాహుటిన అమెరికా నుంచి రాక

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హుటాహుటిన తన అమెరికా పర్యటనను ముగించుకుని ఢిల్లీ వెళ్లి కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌ను ప్రసన్నం చేసుకుని



ప్రభుత్వంపై జరుగుతున్న ప్రచారం, నష్టనివారణ చర్యలను చేసుకున్నారంటూ విశాఖపట్నంలోనేగాక రాష్ట్ర స్థాయిలోనూ చర్చ సాగుతోంది. టిసిఎస్‌కు 99 పైసలకే ఎకరాను కేటాయించడంపై అనేక మంది నుంచి విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. కొంతమందైతే టాటా పెద్ద సంస్థ కాబట్టి మంచిదే అనే అభిప్రాయం కూడా మిశ్రమంగా వినిపించింది. కానీ ఐటి కార్యకలాపాలనే 2025 ఫిబ్రవరిలో దేశంలో ప్రారంభించినట్లు చెబుతున్న ఉర్సా క్లస్టర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అంతకు ముందే 2016-2019 మధ్య కాలంలో కాపులుప్పాడలో భూమిని ఇచ్చేసినట్లు వెల్లడించడం చూస్తే కొత్త కథను తెరపైకి తెచ్చారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఐటి హిల్ నెంబర్ 3లో మూడున్నర ఎకరాలకుగానీ, గతంలో కాపులుప్పాడలో యాభై ఆరున్నర ఎకరాలనుగానీ ఉర్సాకు కేటాయించినప్పుడు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో 'కన్నంలో తేలుకుట్టిన దొంగలా' కూటమి సర్కారు దొరికిపోయినట్లయింది. ఉర్సా ఒక డొల్ల కంపెనీయని, రాష్ట్రంలోని టిడిపి ఎంపీ కేశినేని చిన్నికి సంబంధించిన గ్యాంగ్ అంతా ఇందులో ఉండి భూములు కొట్టేసే గూడుపుఠానీ నడుపుతోందని రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నడుస్తోంది.

మరోవైపు ఉర్సా అధిపతి అబ్బూరి సతీష్ స్పందిస్తూ నిపుణులైన వారంతా ఉన్నామని, 1990వ దశకం నుంచి గ్లోబల్‌గా పనిచేస్తున్నామని, భారత్‌లో ఈ మధ్యనే కార్యకలాపాలు ప్రారంభించామని ఒక ఆంగ్ల పత్రికకు ఈ నెల 22న తెలిపారు. 99 పైసలకు ఎకరా తీసుకోలేదని చెప్పుకొచ్చారు. ఏదేమైనా ఉర్సాకు భూ అక్రమ కేటాయింపులు కూటమికి, చంద్రబాబుకూ పెద్ద అవినీతి మరకనే మిగల్చనున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కెజిహెచ్ సముదాయాన్ని పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దాలి

సిఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖలోని కెజిహెచ్‌ను ఢిల్లీ ఎయిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 26న విశాఖ వేదికగా ఇచ్చిన హామీపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ హర్షం వెలిబుచ్చారు. అదే సమయంలో కెజిహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ సముదాయాన్ని ఉత్తరాంధ్ర పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ మేరకు సిఎంకు ఆదివారం లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. కెజిహెచ్ 180 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన చారిత్రాత్మక సంస్థ అని గుర్తుచేశారు. అందులో రోగులకు అందిస్తున్న సేవలకు అనుగుణంగా కావాల్సిన సౌకర్యాలు లేవని తెలిపారు. దీంతో ఆసుపత్రి వద్ద నిత్యం రద్దీ వాతావరణం కనిపిస్తోందని పేర్కొన్నారు. పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల ఖర్చులను భరించలేరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నా వారు అటువంటి ఆసుపత్రుల్లో అదనంగా ఉండే ఖర్చులను భరించాల్సి వస్తోందన్నారు. ఆ విషయాలను దృష్టిలో పెట్టుకుని కెజిహెచ్ వంటి ప్రభుత్వ ఆసుపత్రులను బలపరచవలసి ఉందన్నారు. ఉత్తరాంధ్రలోని కెజిహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ సముదాయాన్ని ప్రాంతీయ వ్యవస్థగా, కేవలం వైద్య సౌకర్యాలు అందించే ఆసుపత్రిగానే కాకుండా ఆ ప్రాంతంలో ఉన్న ఆరోగ్య సమస్యల విషయంలో పరిశోధనలు జరిపే ఎయిమ్స్ తరహా ప్రాంతీయ పరిశోధనా సంస్థగా, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇండియన్ కౌన్సిల్ అఫ్ మెడికల్ రీసెర్చ్ పరిధిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు కావాల్సిన నిధులను రాష్ట్రానికి ప్రత్యేకంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డ సిఇఒను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తున్న, చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన, మహిళ హెచ్ఆర్‌పై లైంగిక దాడికి పాల్పడి, ఉద్యోగం నుంచి తొలగించి శ్రీలంక పరారైన కంపెనీ సిఇఒను అరెస్ట్ చేయాలని నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్‌కుమార్, రిపబ్లిక్ ఆన్‌పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ నాయకులు దౌలత్‌రామ్ డిమాండ్ చేశారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ, తనపై సిఇఒ లైంగిక దాడికి పాల్పడ్డాడని సదరు మహిళ ఫిర్యాదు చేయడంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారని దీంతో ఆమె పోలీసులకు, కార్మిక శాఖ అధికారులకు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందన్నారు. అయినప్పటికీ వారు స్పందించలేదన్నారు.

టెన్త్‌లో ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు

'ప్రజాశక్తి'తో అనకాపల్లి డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు

ప్రజాశక్తి - అనకాపల్లి : పదో తరగతిలో ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాలు ఇటీవల విడుదల కావడం, అందులో అనకాపల్లి జిల్లాకు ఐదో స్థానం రావడం నేపథ్యంలో సప్లిమెంటరీకి సంబంధించిన పలు వివరాలను ఆయన 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

2024 - 25లో ఎంతమంది విద్యార్థులు పరీక్ష తప్పారు ?

పదో తరగతి పరీక్షకు సుమారు 22 వేల మంది హాజరు కాగా వారిలో 2,300 మంది ఫెయిల్ అయ్యారు. ప్రధానంగా గణితంలో 159 మంది, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో వరుసగా 1107, 1183 మంది తప్పగా ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయిన వాళ్లు 1304 మంది, రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినవారు 524 మంది ఉన్నారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?





ప్రధానంగా ఫెయిల్ అయిన విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల చేత ఉదయం క్లాసులు నిర్వహిస్తున్నాం. సాయంత్రం ఫాలో అప్ చేయిస్తున్నాం. కెజిబివి విద్యార్థుల కోసం ప్రత్యేకించి సబ్బవరం హాస్టల్‌లో సబ్జెక్టు టీచర్లు చేత క్లాసులు నిర్వహిస్తున్నాం. ప్రతివారం పెర్ఫార్మెన్స్‌పై సమీక్ష జరుపుతున్నాం. మోడల్ పేపర్స్ ప్రాక్టీస్ చేయిస్తున్నాం.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. అంగన్‌వాడీ పాఠశాలల నుంచి 5080 మందిని, అలాగే 7938 మంది డ్రాపౌట్స్‌లో 5841 మందిని యాక్టివ్ చేయడం జరిగింది. మే 20 నుంచి తరగతులు ప్రారంభిస్తాం.

నడక వంతెన నిర్మాణం ఎప్పుడో...

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు బడికి వెళ్లాలంటే నిత్యమూ పరీక్షే. ఈ పాఠశాల జాతీయ రహదారి పక్కనే ఉండటంతో నడక వంతెన లేకపోవడంతో ఇనుప గ్రిల్స్ దాటుకుంటూ విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రిల్స్ దాటే సమయంలో ఏ వాహనం ఎటు నుంచి మీదకు దూసుకొస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదమని తెలిసినా పాఠశాల వదిలినప్పుడు తొందరగా ఇంటికి వెళ్లాలనే తపనతో గ్రిల్స్ మధ్య నుంచి, పై నుంచి దూకి నిత్యం సాహసాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 'కాలి నడక వంతెన' నిర్మాణానికి గత ఏడాది జివిఎంసి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.3.23 కోట్లతో అంచనాలు రూపొందించి ఆమోదం పొందిన దస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. నాలుగు నెలలు కావస్తున్నా కార్యరూపం దాల్చలేదు. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ వంతెన నిర్మించాలని కోరుతున్నా గత పాలకులు విస్మరించారు. కనీసం కూటమి పాలకులైనా స్పందించి వంతెన కల సాకారం చేస్తారని ఆశిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని జనం వాపోతున్నారు.

గతంలో గ్రిల్స్ ఏర్పాటుచేయక ముందు ఉదయం, సాయంత్రం ఇరువైపులా కానిస్టేబుళ్లు విద్యార్థులను సురక్షితంగా రోడ్డు దాటించేవారు. ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశాక అందరూ చుట్టూ తిరిగి వెళతారనే భావనతో పోలీసులు రక్షణ చర్యలు మరిచారు. దాంతో విద్యార్థులే కాకుండా పాదచారులు, వృద్ధులు సైతం గ్రిల్స్ మధ్య నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం పోలీసులైనా స్పందించి నడక వంతెన నిర్మాణం చేపట్టే వరకూ విద్యార్థులు, పాదచారులు గ్రిల్స్ దాట కుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



త్వరలో పనులు చేపడతాం



ఇక్కడి నడక వంతెన నిర్మాణం విషయంపై ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చర్చించారు. తొందరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొంది టెండర్ ప్రక్రియకు వస్తుంది. వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

కె.కనకమహాలక్ష్మి
జివింఎసి జోన్-2 కమిషనర్

ఆర్ఎంపిల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-మధురవాడ : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఇంటర్, 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన గ్రామీణ వైద్యుల పిల్లలకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. స్థానిక ఆర్య డయాగ్నస్టిక్ సెంటర్లో జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో సుమారు 40 మంది విద్యార్థులకు ముఖ్య అతిథులు మెమోంటులు, బహుమతులతో సత్కరించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, ఆర్ఎంపి పిల్లలు ఉన్నతంగా చదివి అత్యున్నత స్థానాలను అధిగమిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఏం అవ్వాలనుకుంటున్నారో ఇప్పుడే నిర్ణయించుకొని తగిన కృషి చేస్తే ఫలితం సాధిస్తారని ప్రభా కాలేజ్ ప్రిన్సిపల్ ఓమ్ దీపక్ అన్నారు. అనంతరం డాక్టర్ అవినాష్ నరాలకు సంబంధించిన వ్యాధులపై వైద్య విజ్ఞానాన్ని అందించారు. మహిళా సంబంధిత వ్యాధులకు చేసే పరీక్షలు, చేయించుకోవాల్సిన చికిత్సలపై డాక్టర్ స్వాతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, సంఘం గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద చిరంజీవి, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, అనకాపల్లి కార్యదర్శి వీరభద్రరావు, జోనల్ కోశాధికారి కనకారావు, గణేష్, పద్మ, సుశీల, మైక్రో లాప్స్ అధినేత ఉంగరాలు ఈశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న గంటా రవితేజ

100 మంది రక్తదానం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు తెలుగు యువత అధ్యక్షులు గరే సదానంద పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఆయన నివాసం వద్ద రక్త దాన శిబిరం నిర్వహించారు. విశాఖ రామ్ నగర్, ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో సుమారు 100 మంది రక్త దానం చేశారు. బ్లడ్ సెంటర్ వైద్యులు సత్య నారాయణ, సిబ్బంది సేవలు అందించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ ఈ శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. సదానందకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కళింగ సంఘం సమావేశం

ప్రజాశక్తి- కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ అత్యవసర సమావేశం మధురవాడ అయోధ్యనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీపాన వెంకటరమణ ఆధ్వర్యాన నిర్వహించారు. కమిటీ సభ్యులందరూ ఇద్దరి నుంచి ఐదుగురు వరకు సభ్యులను చేర్పించాలని ఆయన సూచించారు. రూ.500 సభ్యత్వంతో ఒక ఏడాది, రూ.1000 సభ్యత్వంతో రెండేళ్ల సంఘంలో కొనసాగవచ్చని ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం తీర్మానం చేసింది. మే నెలలో అసోసియేషన్ రెన్యువల్ చేసి జూన్ 8వ తేదీన జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించాలని ఏకగ్రీవంగా కమిటీ తీర్మానం చేసింది.

కరాటే శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి మినీ స్టేడియంలో ఆదివారం కరాటే వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించారు. రెమో లయన్స్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు రెమో యాదవ్ ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాసం, మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెంపుదలకు క్రీడలు దోహదపడతాయన్నారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు రెమో యాదవ్ మాట్లాడుతూ, జూన్ 8వ తేదీ వరకు మినీ స్టేడియంతో పాటు గొల్లలపాలెంలోని సిడార్ స్కూల్, కోరాడపేట, సంగివలస, చిట్టివలస, శ్రీరామకృష్ణ విద్యాలయం తదితర ప్రాంతాల్లో కరాటే శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వరహాలరావు, మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్రకుమార్, మణికంఠ స్వీట్ అధినేత ఎ.నాగరాజు, క్రీడాకారులు బి.శ్రీనివాసరెడ్డి, పలువురు కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు విడుదల

ప్రజాశక్తి -భీమునిపట్నం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిచేస్తున్న కూలీల వేతనాలకు సంబంధించి ప్రభుత్వం వేతన బకాయిలు పాక్షికంగా విడుదల చేసింది. గతేడాది డిసెంబర్ 21 తర్వాత చెల్లించాల్సిన వేతన బకాయిలతో పాటు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల బకాయి వేతనాలు విడుదలైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పని చేసిన కాలానికి 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలని చట్టం చెబుతున్నా ఇందుకు భిన్నంగా తీవ్ర జాప్యం జరిగింది. మండలంలో గతేడాది డిసెంబర్ 21 నుంచి ఇప్పటి వరకు కూలీలు 21,600 పని దినాలు చేసినట్లు సమాచారం. చెరువులు, సాగునీటి కాల్వలు 28 చోట్ల పనులు జరుగుతున్నాయి. కూలీలకు సుమారు రూ.65 నుంచి రూ.68 లక్షలు బకాయి వేతనాలు చెల్లించాల్సి ఉండగా నాలుగైదు రోజుల క్రితం పాక్షికంగా నిధులు విడుదలైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మార్చి, ఏప్రిల్ నెలల బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఇటీవల పని ప్రదేశాల్లో సిఐటియు ఆధ్వర్యాన కూలీలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసిన విషయం విదితమే.


గంటాను కలిసిన పీలా

ప్రజాశక్తి-మధురవాడ : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో ఆదివారం టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు కలిశారు. జివిఎంసి మేయర్ ఎన్నిక సోమవారం జరగనున్న నేపథ్యంలో కొంతసేపు చర్చించారు.

5 నుంచి ఆలయ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం అనంతపద్మనాభ స్వామి కొండపై ఉన్న దేవాలయంలో పున: ప్రతిష్ట మహోత్సవాన్ని మే 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ నానాజీబాబు తెలిపారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యక్ష సమావేశం నిర్వహించారు. అనంతపద్మనాభ స్వామి కొండ శిఖరంపై పనులు పూర్తి కావడంతో స్వామివారిని ఆలయంలో పున:ప్రతిష్ట చేయడానికి అందరూ సహకారం అందించాలని కోరారు. అన్ని గ్రామాల నుంచి ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, కె.రమణ, కె.దామోదరరావు, కృష్ణాపురం పద్మనాభం భక్తులు ఎస్.నారాయణరావు, ఆర్.సన్యాసి రావు, కె.లక్ష్మి, గుర్రపు ప్రసాదు, బి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్య



ప్రచారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్య అందిస్తున్నట్లు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లి దండ్రులను కోరుతూ చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదివారం ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. హైస్కూల్ ఆవరణలో ప్రచార వాహనాన్ని మురళీమోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024- 25 విద్యా సంవత్సరంలో టెన్త్ పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాల ముందుందని వివరించారు. 587 మార్కులతో పాటు 12 మందికి 550 మార్కులు, 26 మందికి 500 మార్కులుపై బడి వచ్చాయన్నారు. గతేడాది ఐదుగురు ట్రిపుల్ ఐటికి ఇదే పాఠశాల నుంచి వెళ్లారని తెలిపారు. విశాల మైన తరగతి గదులు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలాజికల్ సైన్స్ లేబరేటరీలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మండలంలో ఏకైక పిఎంశ్రీ స్కూల్‌గా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం హైస్కూల్లో శ్రమదానం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. పాఠశాలలో ఇటీవల కాలంలో వేసిన మొక్కలు వేసవి సెలవుల నేపత్యంలో ఎండిపోకుండా ఉండేందుకు నీరు పోసి సేవాభావాన్ని చాటుకున్నారు. పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు బి.ముత్యాలనాయుడు స్థానికంగా నివాసం ఉంటూ ప్రతిరోజు పాఠశాలలో క్రీడామైదానాన్ని పరిశీలించి, స్థానిక విద్యార్థులు, యూత్‌తో మొక్కలను పెంచేలా చర్యలు చేపడుతున్నారు. ఇటీవల ఈ పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడంతో పాఠశాలలోని క్రీడా మైదానం, కిచెన్ గార్డెన్‌ను ప్రధానోపాధ్యాయులు కెఆర్‌కె.పట్నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్ పనులుచేపట్టారు. దాతల సహకారంతో సమకూర్చిన మొక్కలను పాఠశాల ఆవరణలో వేసి ప్రతిరోజు నీరు పెట్టేవారు. ప్రస్తుతం పాఠశాలకు సెలవులు కావడంతో పాఠశాల వాచ్‌మ్యాన్ అప్పారావుకు సహాయంగా మొక్కలు పెంచే బాధ్యతను స్థానిక యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా తీసుకున్నారు. నూతన షటిల్ కోర్టు ఏర్పాటు చేయడంతో దూళి ఎగరకుండా కోర్టు మొత్తం నీటితో తడిపి శ్రమదానం చేశారు. స్థానిక విద్యార్థులు కిలాని వెంకటేష్, కోనారి లోకేష్, కంచిబోయిన గోవర్ధన్, కొలగాని కార్తీక్, స్థానిక యువకులు రొంగలి సత్యనారాయణ, బాల (నేపాల్), పెనుమత్స గణపతి, సంపంగి అనిల్ తదితరులు ఈ పనుల్లో పాల్గొన్నారు. వీరిని స్థానికులు, వాకర్స్ అభినందించారు.



మొక్కలను నీరు పోస్తున్న విద్యార్థులు

చర్మవ్యాధుల చికిత్సలో లేజర్ వినియోగంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-మధురవాడ : చర్మవ్యాధుల చికిత్సలో (డెర్మటాలజీ) లేజర్ వినియోగంపై వైద్య వృత్తినిపుణులకు అవగాహన కలిగించేందుకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆధ్వర్యాన 'వేవ్స్ అండ్ వేవ్‌లెంగ్త్స్' పేరుతో ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. మధురైకి చెందిన ప్రముఖ లేజర్ వైద్య నిపుణుడు డాక్టర్ అవిటస్ జాన్ రాకేష్ ప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆధునిక లేజర్ సాంకేతికతలపై ప్రత్యక్ష డెమో సెషన్లు నిర్వహించారు. జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, ఈ తరహా వర్క్‌షాప్‌లు పీజీ విద్యార్థుల పాఠ్యాంశం, పరిశోధనలో కీలకంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు అనర్హులు లేజర్ చికిత్సలు చేయడం వల్ల వచ్చే ప్రతికూల ఫలితాలపై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. డాక్టర్ బివి.రామచంద్ర, శాస్త్రీయ చైర్మన్ డాక్టర్ రాహుల్ రాయ్ లేజర్ సాంకేతికతలలో తాజా అభివృద్ధిపై డెర్మటాలజిస్టులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాల్సిన అవసరాన్ని విశదీకరించారు.

మల్లె తోటకు ఎర్రనల్లి

- మాడిపోతున్న పువ్వులు
- పెట్టుబడులు రాక రైతుల దిగాలు

ప్రజాశక్తి-ఆనందపురం : మల్లె పూల తోటలకు ఎ(ర్రనల్లి తెగులు సోకడంతో తోటలు మాడిపోయి పెట్టుబడులు రాక రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలోని ఆనందపురం, బీపీ కల్లాలు, పెద్దిపాలెం వెల్లంకి, తర్లువాడ, పందలపాక, చందక, గొట్టిపల్లి, కుశలవాడ ముచ్చర్ల, వేమగోట్టిపాలెం తదితర గ్రామాలలో పూల తోటలు ఎక్కువగా పండిస్తుంటారు. మార్చి, ఏప్రిల్, మే, నెలల్లో పలు శుభకార్యాలు వల్ల పువ్వుల ధరలకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. వేసవికాలం వచ్చిందంటే పువ్వుల పంటతో రైతులు బిజీబిజీగా వ్యవసాయాన్ని సాగు చేస్తుంటారు. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు పువ్వుల సీజన్‌గా చెప్పుకోవచ్చు. మల్లె, విరజాజులు, కనకాంబరాలు, బంతి, మందారం మొదలగు పువ్వులను మార్కెట్లో విక్రయాలు రైతులు చేస్తుంటారు. గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా పువ్వులు రైతులకు రాబడి అంతంత మాత్రమే. మల్లె తోటలకు కొత్తరకం ఎర్రనల్లి పురుగు సోకి పంటను సర్వ నాశనం చేస్తుంది. పువ్వు లోపల పురుగు పట్టడంతో తోట మాడిపోతుంది. అనేక రకాల మందులు తెచ్చి పిచికారి చేసినప్పటికీ తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. పురుగుల మందుల దుకాణాల్లో తెచ్చిన మందులు సరిగ్గా పనిచేయడం లేదని, వేల రూపాయలు వెచ్చించి మందులు కొన్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములను సాగు చేసి పెట్టుబడి పెట్టినా పంటను పురుగు నాశనం చేస్తోందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి కావలసిన నాణ్యమైన పురుగులు మందులను తక్కువ ధరకు సబ్సిడీపై అందిస్తే కొంతమేర ఉపశమనం కలుగుతుందని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి, కావలసిన పురుగుల మందులను సూచించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎయును సందర్శించిన ఒడిశా గవర్నర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు ఆదివారం ఉదయం సందర్శించారు. ఆయనకు ఏయు ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ స్వాగతం పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలను ఒడిశా గవర్నర్‌కు ఎయు విసి వివరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయడం, విశ్వవిద్యాలయ అవసరాలకు సరిపోయే విధంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని జరిపే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని కె.హరిబాబు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆచార్యులుగా సేవలందించి నేడు ఒడిశా రాష్ట్ర గవర్నర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ కె.హరిబాబును ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున విసి రాజశేఖర్ సత్కరించారు.



మీడియాతో మాట్లాడుతున్న హోంమత్రి అనిత

సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం

- రాష్ట్ర హోంమంత్రి అనిత

ప్రజాశక్తి -గోపాలపట్నం : సామాన్య భక్తులకు త్వరితగతిన అప్పన్న దర్శనం కల్పిస్తామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె ఆదివారం సింహాచలం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సంవత్సరం సామాన్య భక్తులకు పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని తెలిపారు. విఐపిలు, వివిఐపిలతో సామాన్య భక్త జనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. అనంతరం దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూలైన్లు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, ఎండోమెంట్ కమిషనర్, ఎఒ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జెడి ఫౌండేషన్ ఆధ్వర్యాన సిబిఐ మాజీ జేడీ వివి.లక్ష్మీనారాయణ పిలుపుమేరకు సామాజిక సేవలో భాగంగా కొబ్బరికాయలు, కుండలు, కూరగాయల వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులకు ఎండ, వర్షం నుంచి రక్షణగా ఉండేందుకు గొడుగులు పంపిణీచేశారు. యల్లపువానిపాలెం, చంద్రానగర్, కొత్తపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో గొడుగులు అందించారు. ఫౌండేషన్‌కు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీ గ్రూప్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పెన్సిళ్లు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి- గాజువాక : సిఐటియు నాయకులు కణితి అప్పలరాజు కుమారుడు కణితి దుర్గాప్రసాద్ ఎనిమిదో వర్థంతి సందర్భంగా జనరేషన్ యువర్ చిల్డ్రన్ హోమ్ పిల్లల ఆశ్రమం వద్ద ఆదివారం అనాథ పిల్లలకు పెన్నులు, పెన్సిళ్లు, మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, దుర్గాప్రసాద్ చనిపోయినప్పుడు ఐదుగురికి అవయవదానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో తల్లిదండ్రుల ధైర్యాన్ని కూడా మెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, సీంసిరి శ్రీనివాస్, నమ్మి అప్పారావు, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి, మంత్రి గోపీనాథ్, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

రజకులకు రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి -మాధవధార : ప్రయివేటు సంస్థలలో రజకులకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్‌చేశారు. కంచరపాలెం సిఐటియు కార్యాలయంలో ఎన్.గౌరి అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులు సుమారు 50వేల మంది ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 11 నెలలు అయినా రజకుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రజక రాష్ట్ర కార్పొరేషన్‌లో గ్రేటర్ విశాఖ జిల్లాకు డైరెక్టర్ కూడా ఇవ్వలేదన్నారు. రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు వాగ్దానాలు చేశారని, తక్షణమే పరిష్కరించాలని కోరారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని, దోబీ పోస్టులు భర్తీ చేయాలని, పక్కా ఇల్లు మంజూరు చేయాలని, దోబీ ఘాట్లు నిర్మించాలని, వృత్తి చెరువులు హక్కు కల్పించాలని, లాండ్రీ వృత్తిదారులకు బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఆదరణ పథకం వృత్తి పనిముట్లు కేటాయించాలని, ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.అప్పారావు, కె.శ్రీను, ఎన్.గౌరి, ఆర్.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

'నర్సింగరావుపై దాడి జరగలేదు'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆవాల నర్సింగరావుపై ఎవరూ దాడి చేయలేదని ఆయనే ఒక రాయి మీద పడిపోయినట్లు నార్త్ జోన్ ఎసిపి లక్ష్మీమూర్తి తెలిపారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఆవాల నర్సింగరావు ఈనెల 11వ తేదీన మద్యం తాగి ఒక పార్కులో స్పృహ తప్పిపోయి రాయి మీద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది అని తెలిపారు. మతిస్థిమితం లేకుండా ఎవరో తనను గాయపరిచినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారని, దీంతో హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. నర్సింగరావు చికిత్స నుంచి కోలుకుని ఎవరూ గాయపరచలేదని, తనే పడిపోయినట్లు చెప్పారని తెలిపారు. నర్సింగరావు సమక్షంలోనే మీడియాకు వివరించారు. ఈ సమావేశంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

30న మురళీమోహనరావు ఉద్యోగ విరమణ



ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీ మోహనరావు ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు.

1982 నవంబర్ 10వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా బుచ్చయ్య పేట మండలం, మల్లాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 1987 వరకు అదే పాఠశాలలో పని చేశారు. 1987 నుంచి 1995 వరకు ఇదే మండలం కుముందానుపేటలోను, 1995 నుంచి 2001 వరకు నాతవరం మండలం గునుపూడి జెడ్పీ హైస్కూల్‌లో మాథ్స్ అసిస్టెంట్‌గాను, 2001 నుంచి 2008 వరకు మాకవరపాలెం జెడ్పీ హైస్కూల్, 2008 నుంచి 2009 మధ్య సుమారు 4 నెలల పాటు ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్తగానూ పనిచేశారు. 2009 జనవరిలో హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొంది ఆనందపురం మండలం గండిగుండం జెడ్పీ హైస్కూల్‌లో బాధ్యతలు చేపట్టారు. 2009 నుంచి 2015 వరకు భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో, 2015 నుంచి 2025 ఏప్రిల్ వరకు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో పని చేశారు. ఉద్యోగ భాద్యతలు చేపట్టిన ప్రతి చోటా ఆయా పాఠశాలల విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు కృషి చేశారని ఇప్పటికీ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు చెప్పుకుంటున్నారు. 42 ఏళ్ల 5 నెలల 21 రోజుల పాటు ఉద్యోగ భాద్యతలు నిర్వహించారు.

విద్యాభ్యాసం...

మురళీమోహనరావు సొంతూరు శ్రీకాకుళం జిల్లా గార మండలం, వమరవిల్లి గ్రామం. 1968 నుంచి 1975 వరకు 1 నుంచి 7వ తరగతి వమరవిల్లి గ్రామంలో ఉన్న సమితి ప్రాథమికోన్నత పాఠశాలలో , 1975 నుంచి 1978 మధ్య 8 నుంచి 10 తరగతి వరకు కళింగపట్నం కోకా వారి జెడ్పీ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్ నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978 నుంచి 1980 వరకు చదివారు. 1980 నుంచి 1981 వరకు 10 నెలల పాటు వమరవిల్లి ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో (టిటిసి) ఉపాధ్యాయ శిక్షణ పొందారు. విశాఖ డాక్టర్ వియస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1981 నుంచి 1982లో బిఎస్సీ, మేథ్స్ మొదటి సంవత్సరం పూర్తి చేశారు. ప్రతిభ చూపిన పేద పిల్లల పట్ల ఇతను ఎంతగానో ప్రేమను కనబరిచే వారని పలువురు విద్యార్థుల తల్లి దండ్రులు చెబుతున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి పేరు సంపాదించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : రౌడీలు క్రమశిక్షణతో తమ పని తమ చేసుకోవాలని నాలుగో పట్టణ సిఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణంలో రౌడీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగాఖ ఆయన మాట్లాడుతూ, సెటిల్‌మెంట్లు, అనవసర తగాదాల్లో తలదూర్చకుండా ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిఎంఎస్ త్రైవార్షిక సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : బిఎంఎస్ అనుబంధ సంఘం భారతీయ ఇస్పాత్ మజ్దూర్ మహాసంఘ్ ఆధ్వర్యాన రెండు రోజుల త్రైవార్షిక సమావేశాలు ఉక్కునగరం సీడబ్ల్యూసీ-1లో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా విద్యా భారతి జాతీయ అధ్యక్షుడు దూసి రామకృష్ణారావు, బిఎంఎస్ డిప్యూటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేష్ మిశ్రా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.

కెకె.రాజుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కెకె.రాజుకు సీతమ్మధారలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు వైసిపి నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, రాష్ట్ర కళింగ కోమటి మాజీ చైర్మన్ సూరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫాకృష్ణ, డిసిసిబి మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తిలో మరిడి మాంబ అమ్మవారి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారికి భక్తులు పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్ శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మాజీ కార్పొరేటర్ శరడం చిన్నప్పలనాయుడు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అక్రమ లేఅవుట్లతో తస్మాత్ జాగ్రత్త!



అనకాపల్లిలో వేసిన లే అవుట్

- రియల్‌భూంపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నోటీసులే తప్ప, కానరాని హెచ్చరిక బోర్డులు
- అంతిమంగా నష్టపోయేది కొనుగోలుదారుడే

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి జిల్లాగా మారిన నేపథ్యంలో రియల్ వ్యాపారం పెరిగింది. అదే క్రమంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండకపోతే భవిష్యత్తు నష్టం చవిచూసే ఛాన్స్ లేకపోలేదు. దీంతో రెవెన్యూ, వీఎంఆర్‌డిఎ అధికారులు పక్కాగా పర్యవేక్షణ చేయకపోతే ప్రజలు నష్టపోయి బాధితులుగా మిగిలే అవకాశాలు ఉంది. యథేచ్ఛగా వేస్తున్న రియల్ లేఅవుట్లపై పర్యవేక్షణ లేకపోవడం, ఏది అక్రమమో, ఏది సక్రమమో తెలియని స్థితిలో ప్రజలు నష్టపోయే పరిస్థితి ఉన్నందున అన్ని రియల్ లేఅవుట్ల వద్ద హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని, రియల్టర్లకు కాగితపు నోటీసులిచ్చి చర్యలు తీసుకున్నామంటే ప్రజలకు తెలిసే ఛాన్స్ లేదని పలువురు అంటున్నారు.

అనకాపల్లి డివిజన్ పరిధిలో 12 మండలాల్లో లేఅవుట్ల కోసం వచ్చిన దరఖాస్తులను చేస్తూ రియల్ వ్యాపారం ఎలా పెరిగిందో చెప్పొచ్చు. గడచిన నాలుగు నెలల్లో అనకాపల్లిలో 14.9830 ఎకరాలకు సంబంధించి 32 దరఖాస్తులు రాగా, అచ్యుతాపురంలో 24, మునగపాకలో 50, ఇలా మొత్తం 12 మండలాల్లో 294 దరఖాస్తులు వచ్చాయి. సాగుభూమిని వ్యవసాయేతరంగా మార్చడానికి ల్యాండ్ కన్వర్షన్‌కు ఆయా దరఖాస్తులు వచ్చాయంటే రియల్ వ్యాపారం ఏ మేరకు జరుగుతుందో అవగతమవుతుంది. ఇప్పటికే 231.8850 ఎకరాలకు సంబంధించి రూ.3,97,60,394 ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. మరి ఆ మేరకు పర్యవేక్షణ ఉందా అంటే అనుమానమే అన్నది చాలామంది మాట.

అధికారులు జారీ చేస్తున్న నోటీసులను బట్టి, అక్రమ లేఅవుట్లు ఉన్నాయని చెప్పకనే తెలుస్తోంది. వాస్తవానికి అన్ని నిబంధనలు పాటించి లేఅవుట్లు వేస్తున్నారా? లేక ఎవరికి వారే లేఅవుట్లు వేసి ఇళ్లస్థలాలను అమ్మజూపుతున్నారో ప్రజలకు తెలిసే ఛాన్స్ లేదు. ఈ నేపథ్యంలో ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని అధికారులే ఆయా లేఅవుట్ల పూర్తి వివరాలతో కూడిన అనుమతి బోర్డులు పెట్టాల్సిన అవసరం ఉంది.

లేఅవుట్ వేయడమిలా..

లేఅవుట్ చేయాలంటే ముందుగా రెవెన్యూ శాఖకు భూమి మార్కెట్ విలువకు 5శాతం ఫీజు చెల్లించాల్సింది రెవిన్యూ ఫీజు చెల్లించాక వారిచ్చిన సర్టిఫికెట్‌తో లైసెన్స్ సర్వేయర్ తో లేఅవుట్ స్కెచ్ వేయాల్సి ఉంటుంది. దానిలో 40 అడుగుల రోడ్డు తప్పనిసరి. పది శాతం ఓపెన్ స్పేస్ ఉండాలి. రెండు శాతం ప్రజలకు అవసరమైన కాలువలు పైపులైన్లు విద్యుత్ లైన్లకు సంబంధించి ఏర్పాట్లు ఉండాలి. రెండేళ్ల లోపు అవి పూర్తి చేశాక, టెంటాటివ్ లే అవుట్ పాటర్న్ లభిస్తుంది. ఆ తర్వాత పదిశాతం ఓపెన్ స్పేస్‌ను మున్సిపాలిటీ లేదా పంచాయతీలకు గిఫ్ట్‌డీడ్‌గా రాస్తే ఫైనల్ లేఔట్ అనుమతులు లభించినట్లు. అయితే పక్కాగా అవన్నీ పాటిస్తున్న లేఅవుట్ లు ఎన్ని ఉన్నాయో కొనుగోలు దారులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. ఏది అక్రమమో ఏది సక్రమమో కూడా తేల్చుకోలేని పరిస్థితి. అధికారుల పరిశీలనలో అక్రమ లేఅవుట్లుగా గుర్తిస్తే, వంద రెట్లు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అప్పటికే రియల్టర్ లేదా యజమాని నుంచి స్థలాలు చేతులుమారి కొనుగోలుదారులకు అందితే నష్టపోయేది అంతిమంగా వీరే. ఈ నేపథ్యంలో లేఅవుట్ల అనుమతులపై అధికారులు స్పష్టతనిస్తే కొనుగోలుదారులకు మేలు జరుగుతుంది.

ముందస్తు చర్యలే మేలు



జిల్లా కేంద్రంలో లేఅవుట్‌లు పెరుగుతున్నాయి. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా రెవెన్యూ, విఎంఆర్‌డిఎ సంయుక్తంగా రియల్టర్లు అన్ని నిబంధనలు, అనుమతులు పాటించేలా చూడాలి. ప్రజలకు తెలిసేలా బోర్డులు పెట్టించాలి

జి.కోటేశ్వరరావు,
సిపిఎం జిల్లా కార్యదర్శి, అనకాపల్లి

హెచ్చరిక బోర్డులు పెట్టించాలి



సొంతింటి కల సాకారం చేసుకోవాలన్న ప్రజల ఆరాటాన్ని అక్రమ లేఅవుట్ దారులు సొమ్ముచేసుకునే ఛాన్స్ ఉంది.ఏది అక్రమమో, ఏది సక్రమమో ప్రజలకు తెలిసేలా అధికారులే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే మంచిది.

కనిశెట్టి సురేష్ బాబు,
ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్

ముగిసిన నూకాంబిక జాతర



కళాకారులకు జ్ఞాపికలు అందిస్తున్న ఉత్సవ కమిటీ

ప్రజాశక్తి -అనకాపల్లి/ అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించిన తర్వాత నిర్వహించిన గవరపాలెం నూకాంబిన కొత్త అమావాస్య జాతర ఆదివారంతో ముగిసింది. ఆదివారం నెల పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టుపక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ, ఉత్సవ కమిటీలు చర్యలు తీసుకున్నారు.

కళాకారులకు బహుమతులు

జాతర సందర్భంగా స్థానిక ఎన్‌టిఆర్ గ్రౌండ్‌లో నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి కళాకారులతో విభిన్న సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ పర్యవేక్షణలో సాంస్కృతిక పండుగ సందడిగా సాగి శనివారం రాత్రి అమ్మవారి శ్లోత్రాలు సౌందర్య లహరి పారాయణం, స్టీల్ ప్లాంట్ దుర్గారావు బృందం అన్నమాచార్య వాగ్దేవి వరదాయిని, శ్రీ ఉమామహేశ్వర మ్యూజిక్ అండ్ కూచిపూడి అకాడమీ ఆఫ్ ఆర్ట్, సురేష్ చిన్నారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, జగదీష్, బొడ్డపాటి రామ్కుమార్, రాపేటి రామ్ కుమార్, పల్లేల గణేష్, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నూకాంబికా దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు,మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి,ఎర్రవరపు లక్ష్మి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



రక్తదాతలతో ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు ఆదివారం మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. స్థానిక సంఘమిత్ర సొసైటీ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు. వందే భారత్ బ్లడ్ బ్యాంకు ఎండి వినోద్ బాబు, స్థానిక సర్పంచ్ బొడ్డు అక్కు నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, లెక్కల మల్లేశ్వర రావు, సూరెడ్డి బాబురావు దొగ్గ ఏరుకు నాయుడు లెక్కల కోటేశ్వరరావు లింగన్న ట్రస్ట్ సభ్యులు సింగంపల్లి రామారావు జూరెడ్డి దివాకర్ ఎం కొండబాబు పాఠశాల కమిటీ చైర్మన్ సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

68 మందికి కంటి పరీక్షలు

విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. 26 మందిని ఆపరేషన్‌కు ఎంపికచేసి, బస్సులో విశాఖకు తరలించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్ కుమార్, డాక్టర్ జాన్ పాల్గొన్నారు. రక్తదానం, కంటి వైద్యశిబిరాల నిర్వహణకు సహకరించిన వారికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొప్ప వెంకట్రావు ధన్యవాదాలు తెలిపారు.

20న కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా వచ్చేనెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము పిలుపునిచ్చారు. ఆదివారం అచ్యుతాపురంలో సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ, కార్మికుల బలిదానాలతో 8 గంటల పని సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేన కార్మికులందరూ పతాకావిష్కరణలో పాల్గొనా లన్నారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చేందుకు చేసున్న కుట్రలను నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక, రైతు సంఘాలు పిలుపునిచ్చే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. అనంతరం లేబర్ కోడ్లను రద్దు చేయాలని బుక్‌లెట్ విడుదల చేశారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజన్న.సత్తిబాబు, ఎస్ఇజెడ్ కార్మికులు గొర్లె. సత్తిబాబు, రాము, అప్పలరాజు, ఆటో యూనియన్ నాయకులు తట్ట రాజు ,నాయుడు, మోటార్ యూనియన్ నాయకులు రామకష్ణ ,గణేష్ ,చిల్లర వర్తకుల సంఘం నాయకులు చిన్నారావు పాల్గొన్నారు.



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

రాంబిల్లి : లేబర్‌కోడ్లకు వ్యతిరేకంగా వచ్చేనెల 20న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం కన్వీనర్ చందక రామకృష్ణ అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, మేడేన నేవీ గేటు మొదలుకుని అన్నిచోట్లా కార్మికజెండాలను ఆవిష్కరిం చాలని, సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బద్ది భాస్కరరావు, డి కాశియా, సిహెచ్ నూకరాజు, ఉమ్మడి సత్యనారాయణ, సుజాత, పిల్లి మంగ, ఎం దేవి పాల్గొన్నారు.



రాంబిల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న దేముడుబాబు

కార్యకర్తను పరామర్శించిన రవి కుమార్

ప్రజాశక్తి- సబ్బవరం: 20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, ఇంటి వద్దనే ఉంటున్న ఇరువాడ పంచాయతీ శివారు గణపతినగర్ వైసిపి సోషల్ మీడియా కార్యకర్త సాలపు రామును ఆదివారం వైసిపి నేత గండి రవి కుమార్ పరామర్శించారు. రాము ఇంటికి వెళ్లి, అతని ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇరువాడ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కనకరాజు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, వైసిపి నేతలు యడ్లనాయుడు, ఐడి.బాబు, సంద్రన అప్పారావు, దాడి సత్య నారాయణ,మంగబాబు,నూకరాజు, కర్రి తాతారావు, పాల్గొన్నారు.

నగదు పరిహారం చెల్లించాలి



నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

ప్రజాశక్తి- మునగపాక: అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నగదు రూపంలోనే నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితుల సంఘం స్పష్టం చేసింది. ఆదివారయి స్థానిక పిఎసిఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వాసితుల సమావేశంలో సంఘ నాయకులు గణపతి అచ్చం నాయుడు మాట్లాడుతూ, ఇటీవల నిర్వాసితులతో హడావిడిగా గ్రామ సభలు నిర్వహించిన అధికారులు, నేటికీ పరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు.. కార్యక్రమంలో అనకాపల్లి సౌత్ జగ్గయ్యపేట అగ్రహారం, నాగులపల్లి, తోటాడ, ఒంపోలు, మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుండి జూన్ 6 వరకు పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహిస్తామని స్థానిక గ్రంథాలయాధికారి కె.జగన్నాధం ఆదివారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. విజ్ఞాన శిబిరాలలో విద్యార్థులకు కథలు వినిపించడం, నీతి కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్లతో బొమ్మలు తయారీ, జి.కె., క్విజ్, డ్యాన్స్, ఆటలు మొదలగునవి నేర్పిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపాలని గ్రంథాలయాధికారి కోరారు.

నేడు ఒడిశా గవర్నర్ రాక

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం ఉదయం 10:30 గంటలకు కొండకర్ల ఇచ్చా ఫౌండేషన్‌కు రానున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి అరుణ క్రాంతి పంతం ప్రకటనలో తెలిపారు. ఇచ్చా ఫౌండేషన్‌లో అనాథ వికలాంగ బాలలకు చేపడుతున్న పలు కార్యక్రమాలను గవర్నర్ తెలుసుకుంటారని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని నరసింగపల్లి సబ్‌స్టేషన్ తాళ్లపాలెం ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతు పనులు కారణంగా ఈనెల 28న సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ రామకృష్ణ తెలిపారు. నరసింగపల్లి సబ్ స్టేషన్ పరిధిలో నరసింగపల్లి, జె తుని, ఎన్‌జి పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినిపాలెం, పరవాడపాలెం, జమ్మదల పాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవాని పాలెం, ఎఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, యేనుగుతుని, చిన్న యెనుగుతుని,జీ. భీమవరం, సింగవరం, అచ్చెర్ల,కోత అచ్చెర్ల, మొసయ్యపేట, గోకవానిపాలెం గ్రామాలకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

తాళ్లపాలెం ఫీడర్ పరిధిలోని వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా వేళలు మార్పు చేశారని, ఉదయం 4గంటల నుండి 8గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

టిడిపి నారపాడు గ్రామ కమిటీ

ప్రజాశక్తి -సబ్బవరం.: మండలంలోని నారపాడు పంచాయతీలో తెలుగుదేశం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, ఎపి ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జి ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి ,అనకాపల్లి యాదవ సంఘం అధ్యక్షులు భరణిగానా సాయినాధరావు, సబ్బవరం సమన్వయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ కె కృష్ణంరాజు సమక్షంలో కమిటీ వేశారు. గ్రామ టిడిపి అధ్యక్షులుగా రొంగలి శ్రీనివాసరావు ఉపాధ్యక్షులుగా ఈగల్ వెంకట్ ,కార్యదర్శిగా ఆకుల నాగేశ్వరరావు ,కార్యనిర్వహణ సభ్యులుగా సాడి శ్రీనివాసరావు ,ఎస్ .వి .సత్యనారాయణ ,జొన్నాడ రాజేష్, వంగలపూడి కనకరాజు ,కార్యవర్గ సభ్యులు బట్ట వెంకట్ ,నామాల అప్పారావు ,చింతాడ సన్యాసిరావు, కోశాధికారి గవిరెడ్డి అప్పలనాయుడులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు బలిరెడ్డి నూకరాజు, కొరుపోలు గోవింద్, కోటిని తాతారావు , ఎడ్ల శ్రీనివాసరావు, రాజాన శ్రీనివాసరావు, రొంగలి వెంకటరమణమూర్తి ,రొంగలి ముసలి నాయుడు, గాజుల వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రవేశ పరీక్ష రాశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గురుకులంలో ప్రవేశానికి తమ పాఠశాలలో 201 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకి 180 మంది మాత్రమే హాజరైనారు. తీవ్ర వేసవిలో కూడా సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, తల్లిదండ్రుల్లో ఈ స్పందన చూస్తుంటే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి భారీగా ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తుందని అన్నారు. హాజరైన విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, తాగునీరు, మెడికల్ క్యాంపు కల్పించామన్నారు.



గురుకులంలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

డోలీ మోతల నుంచి విముక్తి కల్పించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న
- హామీలే తప్ప కానరాని రోడ్డు నిర్మాణాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసి గిరిజన గ్రామాల్లో డోలి మోతలు అరికట్టడంలో ప్రభుత్వ పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న విమర్శించారు. ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తే గిరిజన గ్రామాల పురోభివృద్ధి సాధిస్తామని నమ్మి ఓట్లేసిన గిరిజనులకు సరైన న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సిఎంగా పవన్‌కల్యాణ్ అడవిబాట పట్టి, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినా పనుల్లో కదలిక లేదన్నారు. దీంతో షరామామూలుగానే డోలీమోతలు కొనసాగుతున్నాయని, మన్యవాసులు నానా ఇబ్బందులు పడుతున్నామని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు రోజులు క్రితం ఆవురువాడ పంచాయతీలో పసవులబందకు చెందిన సీదిరి కొండలరావు అనే ఏడేళ్ల బాలుడిని కుటుంబసభ్యులు ఆరు కిలోమీటర్లు దూరం డోలిలో మోసి కొత్తకోట ఆసుపత్రికి తరలించారు. శనివారం రోలుగుంట మండలం ఆర్ల పంచాయితీలో నీలిబందలో గమ్మెల సింహాద్రి అనే తొమ్మిదేళ్ల బాలుడిని డోలిలో రావికమతం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారన్నారు. ఇలా వరుస డోలి మోతల ఘటనలో ఆదివాసీల్లో ఆందోళన రేగుతోందన్నారు

శంకరం పంచాయతీలోని అసంపూర్తిగా నిలిచిపోయిన తాడివలస, గోప్పూరు, రాయిపాలెం. రాజం పేట, వెలగల పాడు. కొత్తవలస, మామిడిపాలెం గిరిజన గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించాలని, కొత్తవలస, తాడివలస గెడ్డలపై రెండు బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. ఎన్నికల ముందు ఆయా గ్రామాలకు రోడ్లుసౌకర్యం కల్పనకు రూ.9,20 కోట్లు మంజూరుకాగా, పనులు చేస్తున్నట్లు నమ్మబలికినా, ఆచరణలో ముందుకు కదలలేదని మండిపడ్డారు. దీంతో వర్షాల్లోస్తే గర్భిణులు, రోగులకు డోలిమోతలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రాకపోకలకు వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గొటివాడ నుంచి కొత్తవలస, వెలగలపాడు, గోప్పుపూరు, తాడివలస మీదుగా రాయిపాలెం, రాజంపేట మీదుగా కృష్ణంపాలెం తారురోడ్డు సౌకర్యం కల్పిస్తే వందలాది మంది గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం హామీ నెరవేరకపోగా, ఎంపీ, ఎమ్మెల్యేలు స్థానికేతరులు కావ డంతో గిరిజన సమస్యలను



బాలుడిని డోలీలో మోసుకెళుతున్న గిరిజనులు

పట్టించుకునే దిక్కు లేకుండా పోయిందని వెంకన్న విమర్శించారు.

గతేడాది కొత్తవలస గెడ్డదాటలేక గిరిజనుడు చనిపోయాడని,తాడి వలస గెడ్డ దాటలేక గర్భిణి గెడ్డ



మహిళలను డోలీలో తీసుకెళ్తున్న కుటుంబీకులు (ఫైల్)

ఒడ్డునే ప్రసవించిందని, ఇలా మరెన్ని ఘటనలు జరిగితే ప్రభుత్వం అధికారుల్లో కదలిక వస్తుందని ప్రశ్నించారు. ఇదేకాక తాడిపర్తి పంచాయతీ అజయ్‌పురం, కొత్తూరు చుట్టుగెడ్డ, రాస గోప్పూరు, సిరిపురం, చినపిట్టగెడ్డ, కొండవీది పెద గొర్రిగెడ్డ చిన గొర్రిగెడ్డ, పసువులబంద, కోనాం పంచాయతీ రేళ్ళల పాలెం, చెరుగుబిల్లి మళ్లిపాడు జూజులపాలెం ,బందవీది కొత్తవీధి, జయపురం తదితర గిరిజన గ్రామాలకు డోలిమోతలు తప్పడం లేదని వెంకన్న అన్నారు. చింతలపూడి పంచాయతీ బోడిగరువు నేరేళ్ళపూడి, మదన గరువు గిరిజన గ్రామాలకు రూ.రెండు కోట్ల ట్రైబల్ డెవలప్‌మెంట్ నిధులు మంజూరైనా అరకొర పనులతో ఆగిపోవడంతో కష్టాలు తప్పడం లేదన్నారు. గర్భింగి పంచాయతీ లో కించుమండకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి, డోలీమోతల నుంచి విముక్తి కల్పించాలని వెంకన్న కోరారు.

చెట్ల అక్రమ నరికివేతపై చర్యలు తీసుకోండి



చెరువు గర్భంలో నరికిన చెట్లు పరిశీలిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 16, సూరపురాజు చెరువు గర్భంలో చెట్లను అక్రమంగా నరికివేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పెందుర్తి వైసిపి నాయకులు గండి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సూరపు రాజు చెరువును సందర్శించి నరికివేసిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సూరపు రాజు చెరువు సాగునీటి సంఘం పాలకవర్గం, పంచాయతీ పాలకవర్గం, ఆయుకట్టు రైతులకు, గ్రామ ప్రజలకు తెలియకుండా, గ్రామసభ నిర్వహించకుండా చెరువు గర్భంలో సోషల్ ఫారెస్ట్ వారు గతంలో వేసిన నీలగిరి, మద్ది, నేరేడు చెట్లు నరికి వేయడం అన్యాయమని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒలకు స్పందనలో స్థానికులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే, తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ గోలజాన దుర్గాప్రసాద , ఇరోతి చిన అప్పలనాయుడు, లగిశెట్టి కుమార్,సత్యారావు, లగిశెట్టి అప్పలరాజు, సాలాపు శ్రీను, ఇరోతి అప్పారావు, సాలాపు సత్యారావు, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ ధిడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, ఐ డి బాబు, యడ్ల నాయుడు , ఎమ్మెల్యే దేముడు, అప్పికొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

కెజిబివి నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి- దేవరాపల్లి: జిల్లాలో 19 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో రూ.8.55 కోట్లతో మనబడి మన భవిష్యత్ పథకంలో అదనపు భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని సమగ్ర శిక్ష డిఇఇ కె.గణేష్ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని బేతపూడి కేజీబివిలో రూ.51.93 లక్షలతో నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణ పనులను స్థానిక ఎఇఇ పి. సంతోషకుమార్‌తో కలిసిపర్యవేక్షించారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో రూ. 51.93 లక్షలు మంజూరు చేయగా, అప్పట్లో రూ.28 లక్షలకు పనులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మనబడి మన భవిష్యత్‌గా పేరు మార్చి పనులను కొనసాగిస్తున్నారు.

జిల్లాలోని. బేతపూడి కేజీబివి జూనియర్ కళాశాలతోపాటు 12 కళాశాల భవనాల నిర్మాణానికి రూ 1.60 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయని డిఇ గణేష్ స్పష్టం చేశారు. ఆ నిధులతో ఆరు డార్మెటరీ గదులు, రెండు టాయిలెట్ల నిర్మాణానికి టెండర్లు కూడాపూర్తయ్యాయని, వెంటనే పనులు చేపట్టి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంనాటికి పూర్తి చేస్తామన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో పరవాడపాలెం గ్రామం పాఠశాల వద్ద ఆదివారం అనకాపల్లి సంజీవని జనరల్ డెంటల్ క్లినిక్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మందికి దంత పరీక్షలు చేశారు. కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయుడు,, ఉగ్గిని రమణ మూర్తి,, ,ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వర రావు, గొంతిని గంగాధర్, స్కూల్ కమిటీ చైర్మన్ దోప్పా లోవరాజు డాక్టర్లు సిద్ధార్థ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు .

ఉద్యోగోన్నతిపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గం పరిధిలోని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సాంఘిక సంక్షేమ, విద్యా సహాయకులు ఆదివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిశారు. సాంఘిక సంక్షేమ, విద్యా సహాయకుల ప్రమోషన్లపై వినతి పత్రం అందించారు

.దీనిపై ఎమ్మెల్యే రామకృష్ణ సానుకూలంగా స్పందించి సాంఘిక సంక్షేమ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నూకాలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి సబ్బవరం: మండలంలోని ఆసకపల్లి పంచాయతీ, ఎరుకునాయుడుపాలెం శివారు కర్రివానిపాలెం గ్రామ దేవత నూకాలమ్మ తల్లి నెల పండగ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. .పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును ఉత్సవ కమిటీ నిర్వాహకులు కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఆసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపిటిసి కర్రి అప్పారావు, కూటమి నాయకులు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, బర్నికాన సాయినాథ రావు, శరగడం రాము, మామిడి శంకర్రావు, మామిడి కొండజి, గండి దుర్గాప్రసాద్ ,గవర అప్పారావు, అక్కిరెడ్డి దుర్గి నాయుడు,గవర సత్యనారాయణ, ఈపు అప్పలరాజు, కర్రి శ్రీను, సింగంపల్లి శ్రీను, బైలపూడి దేముడు,,గొర్లి కుమార్ స్వామి, కాపు శెట్టి ప్రసాద్, నునగొప్పుల రమేష్, లొట్ల శ్రీను ,తమరాన సూరిబాబు, సాలాపు తాతబాబు, కర్రి కృష్ణ, కర్రి త్రినాథ్ కనుగుద్ది కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక నెల పండగ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలో కెపి అగ్రహారం నూకాలమ్మ నెల పండుగ సందర్భంగా ఆదివారం అమ్మవారిని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దర్శించు కున్నారు. ప్రత్యేకపూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్: అనకాపల్లి తాకాశివీధిలో గంధం అమావాస్య సందర్భంగా ఆదివారం నూకాంబికను ప్రత్యేక అలంకరణ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ ప్రత్యేక పూజలు చేసి అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాసి రాజేష్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త , తాకాశి కన్నబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాసి కిషోర్,తాకాశి వీధి పంచాయతీ పెద్దలు, ఉత్సవ కమిటీ, సభ్యుల, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, పాల్గొన్నారు. తాకాశి కొండల రావు, తాకాశి సూర్యారావు, బేతి ఈశ్వర రావు, బోయిన వరహాలు తాడి రామకష్ణ, గంగుపాం మహేష్ దొర, తాకాశి సత్యందొర, తాకాశి నాగేష్, తాకాశి విశ్వేశ్వరరావు,,అదట రమణ బాబు, పలక చంటి, దొండ రామారావు, తాకాశి కిషోర్, తాకాశి నరేష్, తాకాశి అనిల్, కారుకొండి కన్నా, పల్లెల సురేష్, బలి రెడ్డి సత్య, చింతల నవీన్,బుర్ర అశోక్, బుగత అశోక్, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
సోమవారం 28 ఏప్రిల్ 2025

తాగునీరు, రోడ్డు సౌకర్యం లేక..

అజయపురం గిరిజనుల అవస్థలు

▸▸ ఊట నీరే ఆధారం
▸▸ రోడ్డు లేక రాకపోకలకు గెడ్డ దాటాల్సిందే..



ఊటగెడ్డలో నీటిని మోసుకెళుతున్న మహిళలు

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని అజయపురం గ్రామంలో నివసిస్తున్న గిరిజనుల సమస్యలు వర్ణనాతీతం. తాగునీటికి, సరియైన రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది.

మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన(తండా) అజయపురం. ఈ గ్రామంలో పిల్లలు పెద్దలు కలిపి సుమారుగా 90 మంది వరకు నివసిస్తున్నారు. ఈ గ్రామానికి చేరుకోవాలంటే తారకరామా జలాశయంకు సంబంధించిన గెడ్డని దాటుకుని వెళ్లాలి. ఈ జలాశయానికి గేట్లు లేక వర్షాకాలంలోనే కాకుండా నిత్యం నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. వర్షాలు వస్తే ఆ గ్రామ వాసులకు వనవాసం తప్పడం లేదు. వర్షాలు వచ్చి గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తే జబ్బు, జ్వరం వచ్చిన చావాల్సిందే తప్ప మరోదారి లేదు. పిల్లల పాఠశాలకు వెళ్లాలన్నా గెడ్డను దాటుకుని వెళ్లాల్సిందే. గ్రామస్తులంతా కలిపి గెడ్డ తక్కువగా ప్రవహించేటప్పుడు రాకపోకలు సాగించ డానికి తాత్కాలికంగా గెడ్డపై కర్రల వంతెనను వేసుకున్నారు. నీటి ప్రవాహానికి కర్రల వంతెన కొట్టుకుపోయిన పరిస్థితులు ఉన్నాయని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. తాగడానికి ఊటనీరుని ఉపయోగించుకోవలసిన పరిస్థితి నెలకొంది. ఒక్క చేతి బోరు కూడా లేదు. కొండ గెడ్డల నుండి వచ్చే ఊటనీరుని ఒడిసి పట్టుకోవాల్సి వస్తుంది. ఈ నీటిని కూడా ఒడిసి పట్టుకోవడానికి సుమారు 140 అడుగులు దూరం నుండి ఇంటి వద్దకు పైపు వేసుకుని నీరు పట్టుకోవడం జరుగుతుంది. ఎండాకాలంలో అయితే ఆ నీరు కూడా రాదు. ప్రత్యామ్నాయంగా పెద్ద గొయ్యిని తీసుకుని దానిలో ఊటనీరుని నిలువ చేసుకొని నాచుపట్టినా సరే ఆ నీటిని తీసుకుని వచ్చి మరగబెట్టి తాగాల్సి వస్తుంది. నీరు నిలవ ఉండడంతో కాచి వడపోసినప్పటికో తాగడానికి సరిగ్గా ఉండవని గిరిజనులు అంటున్నారు. నిలువ ఉన్న నీటిని తాగడానికి ఉపయోగించుకోవడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.తాగడానికి తాటిపర్తి సమీపంలో ఉన్న పామాయిల్ తోటలో మొక్కలకు పెట్టే నీటిని పట్టుకొని బాటిల్లతో తెచ్చుకుంటున్నామని తెలిపారు. గెడ్డపై తాత్కాలికంగా రాకపోకలకు ఇనుప వంతెన ఏర్పాటు చేయాలని గతంలో సిపిఎం నేతలు ధర్నాలు, నిరసనలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.రహదారి సౌకర్యం లేక గర్భిణీలను, బాలింతలను డోలి మోతలతో తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. రహదారి సౌకర్యం కల్పిస్తే డోలి మోతలు తప్పుతాయని .గ్రామస్తుడు వంతల కేశవరావు తెలిపారు.మురుగు నీరు తాగి అనారోగ్యాల బారిన పడుతున్నామని, చేతి బోరును ఏర్పాటు చేసినట్లు అయితే తాగునీటి ఇబ్బందులు తొలగుతాయని గెమ్మెలి రాజులమ్మ పేర్కొంది.



గెడ్డలో డోలీలో మోసుకెళుతున్న బంధువులు(ఫైల్)

ఉగ్రదాడులపై నిరసనలు

ప్రజాశక్తి-వడ్డాది: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆదివారం రాత్రి వడ్డాదిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వివిధ పార్టీల నేతలు, అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు, పాత్రికేయులు, ఎన్జీవో ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మానవహారం చేపట్టారు. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు.ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులు అర్పించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

పరవాడ : జమ్ము కాశ్మీర్లో ఉగ్రవాద దాడులను నిరసిస్తూ ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండించారు. 28 మంది మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. బాధిత కుటుంబాల్ని ప్రభుత్వం ఆదుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాళ్లపల్లి సన్యాసినాయుడు, కన్నూరు నాయుడు, బి శ్రీను, లచ్చిబాబు పాల్గొన్నారు



వడ్డాదిలో కొవ్వొత్తులతో నివాళి



మాధవధారలో నివాళి అర్పిస్తున్న గంగారావు, నేతలు

మునగపాక: కశ్మీరులో ఉగ్రదాడులను నిరసిస్తూ. స్థానిక గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. భగత్ సింగ్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.కార్యక్రమంలో గ్రామీణ యువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్, దాడి ముసలి నాయుడు, ఆడారి గణపతి అచ్చం నాయుడు, టెక్కలి పరశురాం, జల్లేపల్లి కృష్ణ, దాడి శివ పాల్గొన్నారు.

గణపర్తిలో..గణపర్తి గ్రామంలో జనసేన నాయకులు కాళ్ళ చంద్రమోహన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేపట్టారు .కార్యక్రమంలో కర్రీ లక్ష్మీనారాయణ, ఆడారి గోపి, గిన్నె ప్రసాద్, మల్ల జగదీష్, దిలీప్ ,ఎం రామలక్ష్మి, ఎం తలుపుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: కశ్మీర్‌లోని పెహల్‌గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తు ఆదివారం ఆనందపురం మండల పాస్టర్లు, గ్రామస్తులు కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మతంలో నుంచి బయటకు వచ్చి సాటి మనిషిని గౌరవించాలని నినదించారు. ఫెలోషిప్ అధ్యక్షులు ప్రభుదాస్, వైస్ ప్రెసిడెంట్ శాంతిరాజు, ట్రెజరరీ జాన్ మోజెస్, ప్రభాకర్, గ్రామస్తులు గొల్ల జాని, రవి, రమణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి అమరావతి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అమరావతి పార్కులో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్రావు, సత్యారావు, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

మధురవాడ : పౌర సంక్షేమ సంఘం అధ్వర్యాన మధురవాడ పుర వీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎల్ఎస్.నాయుడు, నాగోతి సూర్యప్రకాష్, జగన్మోహన్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు కూన వెంకటరావు ఆధ్వర్యాన అఖిలపక్ష నాయకులు మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్క్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిరికి పందల చర్యగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సనపల వరప్రసాద్, సనపల శ్రావణ్ కుమార్, కె.సుధాకరరావు, సనపల రామ్ గోపాలరావు, పప్పల రామచంద్రరావు, జిఎన్.మూర్తి, సనపల సత్యమూర్తి, కోన సత్యనారాయణ, సనపల నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు



పరవాడలో కొవ్వొత్తులతో నివాళి



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలో గ్రౌండ్ బాయ్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గెంజి ఈశ్వరరావు, యూత్ లీడర్ పులగాయల గోవిందు, సత్యనారాయణ, శ్రీనులు ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో జడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన పోటీలను ఉద్దేశించి గ్రౌండ్ బాయ్స్ యూత్ లీడర్ గోవిందు బ్రదర్స్ మాట్లాడుతూ, నెలరోజుల పాటు ఐపీఎల్ తరహాలో క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి 15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.6000 అందజేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ మోది నాయుడు మాట్లా డుతూ, ఆటలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుణ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం అమావాస్య

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంధం అమావాస్య పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉద్దండపురం, అమలాపురం, అయ్యన్నపాలెం గ్రామాల్లో అమ్మవార్లను పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.



నక్కపల్లిలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి జనార్ధన్

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి అంతా సిద్ధం చేసినట్లు గ్రంథాలయ అధికారి జనార్ధన్ తెలిపారు.ఈనెల 28 సోమవారం నుండి జూన్ 6 వరకు విజ్ఞాన వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు వేసవి విజ్ఞాన శిబిరం పై అవగాహన కల్పించారు. 40 రోజులపాటు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చీడికాడ: విద్యార్థులలో నైపుణ్యతను పెంపొందిం చేందుకు శాఖా గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామని లైబ్రేరియన్ జోగేశ్వరి తెలిపారు. ఈ శిబిరంలో క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఆనందపురం : ఆనందపురం గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బివిఎస్.అప్పారావు తెలిపారు. ఈ శిబిరంలో కథలు వినడం, పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, ఆటలు, క్విజ్, జికె లాంటి వినోదకార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగపరుచుకోవాలని కోరారు.


చెక్కు పంపిణీ చేస్తున్న స్పీకర్

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాకవరపాలెం మండలం పాపయ్యపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి రామలక్ష్మికి రూ.3,69,432 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఆర్థికంగా తోడ్పడుతుందన్నారు.గత తొమ్మిది నెల్లో నియోజకవర్గంలోని 24 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల అధ్యక్షుడు యర్రాపాత్రుడు, సర్పంచ్ అల్లునాయుడు, మాకవరపాలెం టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట గ్రామ సమీపంలో ఊరిలోప కొండపై అక్రమ క్వారీ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని గ్రామ సర్పంచ దాసరి సూర్య కుమారి, రైతులు డిమాండ్ చేశారు. కొండపై గ్రానైట్ తవ్వకాలలో బ్లాస్టింగులతో క్వారీ సమీపంలో గల కవగుంట గ్రామస్తులు భయ భ్రాంతులకు గురవుతున్నారన్నారు.క్వారీ సమీపం నుంచి రావికమతం, కవగుంట మీదుగా విజె పురం, ఒమ్మలి వయా మాడుగుల వెళ్లే రోడ్డు కావడంతో ఏ సమయంలో రాళ్లు ఎగిరి పడతాయోనని పాదచారులు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.కవగుంట గ్రామానికి చెందిన రైతులు భూముల్లో క్వారీ బుగ్గి, చెత్తాచెదారం పడటంతో బీడు భూములుగా మారి పంటలు పూర్తిగా నాశనం అవుతున్నాయన్నారు. బ్లాస్టింగ్ శబ్దానికి ఇల్లులు దెబ్బతింటున్నాయన్నారు.కోతులు, నక్కలు, ఊర పిల్లులు, చెవల పిల్లలు, అడవి పందులకు తలదాచుకునేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు.


కైలాసపట్నంలో పిల్లర్ దశలో ఉన్న సంపద కేంద్రం

అసంపూర్తిగా సంపద తయారీ కేంద్రాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంపద తయారీ కేంద్రాలు అసంపూర్తిగా నిలిచి పోయాయి. మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ అయినప్పటికీ నేటికీ సంపద సృష్టి కేంద్రం అసంపూర్తిగానే దర్శనమిస్తుంది. ఇదే పరిస్థితి మండలంలో పలు గ్రామాల్లో ఉన్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని తొలిసారిగా మొదలుపెట్టిన కైలాసపట్నం సంపద కేంద్రం నేటికీ పిల్లర్ల స్థాయిలోనే దర్శనమిస్తుంది. దీంతో సేకరించిన చెత్తను రోడ్లకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ తగలబెట్టేయడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సంపద తయారీ కేంద్రాలను త్వరిత గతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.


రోడ్డు పక్కన చెత్తను తగుల బెడుతున్న దృశ్యం

టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలతో..

వడ్డాది కెజిబివిలో ప్రవేశాలకు డిమాండ్

- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు -మక్కువ కనబరుస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మెరుగైన విద్యాబోధన, ఉత్తమ ఫలితాలు, విద్యార్థులకు తగిన వసతి సౌకర్యాలు కలిగి ఉండడంతో మండలంలో వడ్డాది కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహం(కేజీబీవీ)లో ప్రవేశాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన, అవసరమైన తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యాలు కలిగి ఉండడంతో బాలికల తల్లిదండ్రులు తమ పిల్లలను కేజీబీవీలోనే చేర్పించాలని భావిస్తున్నారు. గత కొంతకాలంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో సైతం ఉత్తమ ఫలితాలు సాధించడంతో తల్లిదండ్రుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 40 మంది విద్యార్థులకు గాని 39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలను సాధించారు. టెన్త్‌లో 600 మార్కులకు గాను 560 మార్కులను ఈ పాఠశాలకు చెందిన విద్యార్థిని కడియం శ్రీలాస్య సాధించింది. ఎం.కృష్ణవేణి, మౌనికలు 550 మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్లో సైతం 100శాతం ఫలితాలను సాధించారు. 35 మంది విద్యార్థులకు గాను 35 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎ.వెంకటపద్మ 1000 మార్కులకు 966 మార్కులు సాధించింది. కె.లోహిత 947, యు.గణేశ్వరి 932 మార్కులు సాధించారు. బాలికల తల్లిదండ్రుల ఆసక్తి అధికంగా ఉండడంతో ఆరవ తరగతి ప్రవేశాలకు విపరీతమైన పోటీ నెలకొంది.


ప్రవేశాలకు వచ్చిన పిల్లలు


శ్రీలాస్య 560మార్కులు



వడ్డాది కెజిబివి పాఠశాల

ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాలు

పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు, ఉపాధ్యాయుల ఉత్తమ విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. తమ పిల్లలను కేజీబీవీ లో చేర్పించడానికి తల్లిదండ్రుల ఆసక్తి చూపుతున్నారు.


ఎర్ర సత్యవేణి, చైర్మన్ కెజిబివి

పక్కా ప్రణాళికతో చదివించాం

రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు సాధించడం జరిగింది. పక్కా ప్రణాళికను అనుసరించి విద్యాబోధన ప్రతిరోజు చేశాం. పరీక్షా విధానాలతో, అదనపు తరగతులతో మెరుగైన ఫలితాలు సాధించాం.


కె.అన్నపూర్ణ, ప్రిన్సిపల్ కెజిబివి వడ్డాది

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలోని వెదుర్లగెడ్డ వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల నుండి అక్రమంగా రవాణా జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వంతెన సైతం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వెదుర్లగడ్డకు సమీపంలో విశాలమైన స్థలంలో ఇసుక మేటలు అక్రమదారులు వేస్తున్నారు. వీటిని సమీప గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు పగలు రాత్రి లేకుండా ప్రతిరోజు తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక తవ్వకాలతో వెదుర్ల గడ్డపై వేసిన వంతెన పిల్లర్లు సైతం బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలో వడ్డాది, పెద్దేరు, విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనలు ఇసుక తవ్వకాలతో పిల్లర్లు బయటకు కనిపించి కొద్ది కాలానికి కూలి పోయాయి. ఈ వంతెనల కూలి పోవడంతో రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెదుర్లగడ్డ వంతెన వద్ద జరుగుతున్న అక్రమ రవాణాతో వంతెనకు సైతం ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.


ఇసుక తవ్వకాలతో ప్రమాదకరంగా పిల్లర్లు


ఇసుకను తరలిస్తున్న దృశ్యం

బాధితునికి అండగా సాయానికి రూ.10 సంస్థ

- ఆపరేషన్ కోసం రూ.15,09,951 సేకరణ - డిఎస్‌పి చేతుల మీదుగా అందజేత



శ్రీనుకు నగదు అందజేస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి:రెక్కాడితే గాని.. డొక్కాడని.. పరిస్థితి. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న దొంగల శ్రీను. కూలి పని నిమిత్తం కొబ్బరి తీతకు వెళ్లి ప్రమాదవశాత్తు కొబ్బరి చెట్టుపై నుండి జారిపడి వెన్నుపూస విరిగి పోవడంతో, ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో మంచానికి పరిమితమయ్యాడు. గాయపడ్డ శ్రీను, అతని కుటుంబానికి సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ ఆపరేషన్ కోసం 15,09,951 లక్షల రూపాయలు ఆర్థికసాయం సేకరణ చేపట్టి అండగా నిలిచారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దొంగల శ్రీను కూలి పని నిమిత్తము కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా చెట్టు పైనుంచి కింద పడి వెన్నుపూస విరిగిపోయింది. ఆసుపత్రికి వెళ్లి చూపించగా , ఆపరేషన్ కు సుమారు అధికంగా నగదు ఖర్చు అవుతుందని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఇంటి వద్ద మంచానికే పరిమితమయ్యాడు. సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ అధ్యక్షులు ఏసుబాబు, సారథి టీం సభ్యులతో కలిసి మంచానికి పరిమితమైన శీను, అతని కుటుంబ పరిస్థితిని వీడియో రూపంలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.సంస్థ సభ్యులు, స్నేహితుల సహాయంతో సోషల్ మీడియా ద్వారా రూ.15,09,951 లక్షలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు చేతుల మీదుగా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీను కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఏఎమ్ఏఎల్ కాలేజ్ బాటనీ లెక్చరర్ ఎం.హరిబాబు , ప్రముఖ హోమియోపతి డాక్టర్ శశిధర్, మనం ట్రస్ట్ చైర్మన్ రమేష్ ,శెట్టిపాలెం గ్రామ సర్పంచ్ అల్లు రామనాయుడు , శెట్టిపాలెం గ్రామ యువ నాయకులు గొర్లి వాసుదేవ నాయుడు, సంస్థ సభ్యులు ఖాన్, సాయి, లహరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరసింహమూర్తి

వేట నిషేధ భృతిగా రూ.40 వేలు చెల్లించాలి : వైసిపి

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులకు వేట నిషేధ భృతిని గత ఏడాది, ఈ సంవత్సరం కలిపి రూ.40 వేల రూపాయలు చెల్లించాలని వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక మత్స్యకార నాయకులతో కలిసి మాట్లాడుతూ, గత ఏడాది పరిహారం చెల్లిస్తారని మత్స్యకారులు ఇప్పటివరకు ఎదురు చూశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ఏడాదికి మాత్రమే పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. శనివారం జరిగిన మత్స్యకార సేవలో అనే కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత వేట నిషేధ భృతి పంపిణీలో నూరు శాతం అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న చెప్పారని, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలకు కలిపి 40 వేల రూపాయలు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కాలయాపన చేస్తుందే తప్పా, మాట నిలబెట్టుకున్న దాఖలాలు కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో చినతీనార్ల పంచాయతీ సర్పంచ్ ఎరిపిల్లి ముసలయ్య, నాయకులు ఎరిపిల్లి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.